# అమృతహస్తం

## ద్విభాష్యం రాజేశ్వరరావు

కామాక్షమ్మగారి ఆనందానికి అవధుల్లేవు!!!

ప్రకాశం దగ్గరనుండి ఉత్తరం వచ్చింది!

పోస్ట్‌మేన్ చేతిలోని కవరు అందుకొని, చింపుతూ వుంటే హర్షాతిరేకంతో ఆమె చేతులు వణికేయి! ఉత్తరంలోని విషయం అవగతమయ్యేసరికి మనసు పురివిప్పిన నెమలికి మల్లే నృత్యం చేసింది!

ఆలోచనలు అందాల హరివిల్లులయ్యాయి!!

ఉత్తరం మరోసారి చదువుకుంది ఆవిడ!

"అమ్మకు నమస్కారములు

నేనూ, మీ కోడలు, చిరంజీవి ఇందు కలిసి బెంగుళూరు వెళ్తున్నాం దారిలో 'బ్రేక్ జర్నీ' చేసి మన వూళ్ళో ఒక పూట ఆగుతాము ఈ విధంగానయినా నిన్నూ, నాన్నగారినీ చూడటం అవుతుంది ఇరవై అయిదో తారీఖు ఉదయం మెయిల్లో దిగి, అదే రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి వెళ్ళిపోతాం. నాన్నగారు ఆరోగ్యంగా వున్నారని తలుస్తాను. ఆయనకి నా మీద కోపం తగ్గిందనుకుంటాను - ప్రకాశం'

ఉత్తరం మడిచి గబగబా అడుగులేసుకుంటూ లోనికి వెళ్ళింది కామాక్షమ్మగారు!

వెనుక వరండాలో కవాచీ బల్లమీద తీరుబడిగా కూర్చుని, పొగాకు కాడకు ఈనె తీసి, పొత్తి జాగ్రత్తగా తయారుచేసి దానిని ఆకు మధ్యలో ఉంచి, దివిటీలా పెద్ద చుట్ట తయారుచేసే ప్రయత్నంలో వున్నారు విశ్వనాథంగారు!

రెండు మైళ్ళ దూరంలోని పట్నం హైస్కూల్‌లో తెలుగు పండితుని హోదా వెలిగించి, పదేళ్ళ క్రితం రిటైరయ్యేరాయన! అర్జనలో వున్నంత కాలం ఆయన సంపాదనలో నాలుగో వంతు లంకపుగాకు చుట్టలకు ఖర్చయ్యేది! రిటైరయిన తర్వాత పింఛను డబ్బులో సగం వీటికే ఖర్చవుతోంది అయితే గ్రామంలో స్వంత లోగిలివుండటం వలన, ఇతర బాదరాబందిలు ఏవీ లేకపోవటం వలనా - సంసారం సుఖంగానే గడిచిపోతోంది!

విశ్వనాథం గారికి, కామాక్షమ్మగార్కి ఏకైక సంతానం ప్రకాశం!

ప్రకాశం మెరికలాంటి కుర్రాడు!

ప్రతి క్లాసులోనూ 'ఫస్టు రేంకు'లో నిలబడి ఇంజనీరింగు సీటు సంపాదించాడు! కోర్సు పూర్తయిన వెంటనే బొంబాయిలో ఒక ప్రవేటు కంపెనీలో చేరి తొందరలోనే మూడువేల రూపాయల జీతగాడయ్యేడు!

అంతవరకూ విశ్వనాథం గారికి ఏ విషయంలోనూ పేచీ లేకపోయింది! అయితే - ప్రకాశం ఉద్యోగంలో చేరిన ఏడాదిలోనే అసలు గొడవ ఆరంభమయింది! మంచి సంబంధం చూసి కొడుక్కి పెళ్ళి చెయ్యాలని తపనపడిపోయారు ఆయన తాను ఎన్నో ఉత్తరాలు రాసినా పెళ్ళి విషయం వాయిదా వేస్తూ వుండటం చూసి మనసులో కాస్త అనుమానం కలిగింది ఆయనకు!

తన అనుమానం నిజమే అని తెలిసిన రోజున విశ్వనాథంగారు ఆగ్రహోదగ్రులయ్యారు!

కొడుకు తన మాట కాదని, అదెవతో బెంగాలీ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నందుకు అగ్నిహోత్రావధానుల్లా మండిపడ్డారు!

'ఆ వెధవ నా కడుపున చెడబుట్టేడు' అంటూ ధుమధుమలాడేరు!

'వాడికీ నాకూ ఇక ఏ సంబంధంలేదు' అంటూ వీరావేశంతో ఊగిపోయేరు

'వాడికి తర్పణ విడిచి తద్దినాలు పెట్టేస్తాను!' అంటూ విరుచుకుపడ్డారు.

భర్త కోపం చూసిన కామాక్షమ్మగారు గజగజ వణికిపోయింది.

ఆయన కోపం సంగతి ఆమెకు బాగా తెలుసు!

ఆ తర్వాత -

కొత్త పెళ్ళాంతో వారం రోజులు గడుపుదామని ఇంటికొచ్చిన ప్రకాశం - ఒక్క గంటలోనే - తిరుగు ప్రయాణం కట్టాల్సి వచ్చింది!

విశ్వనాథంగారు ప్రకాశం వైపు కన్నెత్తి చూడలేదు!

పన్నెత్తి పలుకలేదు!!

ప్రకాశం ఆ పరిస్థితిని భరించలేకపోయాడు!

అమ్మా! నేనూ మా ఆవిడా ఇక్కడ ఒక వారం రోజులు గడుపుదామని వచ్చేం! కానీ నాన్న కోపం చూస్తే ఈ ఇంట్లో మాకు స్థానం లేనట్లే కనుపిస్తోంది! ఆయన కోపం తగ్గేక వీలు చూసుకుని మళ్ళీ వస్తాం." అంటూ ఎంత బతిమిలాడినా వినకుండా భార్యను తీసుకుని, వచ్చిన గంటలోనే బయలుదేరి బొంబాయి వెళ్ళిపోయేడు ప్రకాశం!

ఆ రోజున కుమిలి కుమిలి ఏడ్చింది కామాక్షమ్మగారు! తర్వాత – అయిదు సంవత్సరాలు కాలగమనంలో కలిసిపోయేయి! ఈ అయిదు సంవత్సరాలలోనూ భర్తకు ప్రకాశం మీద కోపం తగ్గించటంలో కృతకృత్యురాలయింది ఆవిడ

దాని పర్యవసానంగానే మూడు నెలల క్రితం నుండీ ప్రకాశాన్ని బయలుదేరి రమ్మనమని పదేపదే ఉత్తరాలు రాయసాగింది – అదీ భర్త అనుమతితోటే!!

ఇదిగో – ఇన్నాళ్ళకు ప్రకాశం, కోడలు, మనవరాలు కలిసి బయలుదేరి వస్తున్నారు!!

చుట్టిన పొగ చుట్ట పళ్ళ మధ్య బిగిస్తూ విశ్వనాథంగారు తల ఎత్తి కామాక్షమ్మ వంక చూసేరు! అరక్షణంలో ఆమె చేతిలోని ఉత్తరాన్నీ, ఆమె ముఖంలోని ఆనందాతిశయాన్నీ గ్రహించేరు!"సుపుత్రుడు ఉత్తరం రాశాడేమిటి?" అన్నారు యధాలాపంగా.

"అబ్బాయీవాళ్ళు రేపు ఉదయం మెయిల్లో వస్తున్నారు " అంటూ విషయం వివరించి చెప్పింది. ఆ తర్వాత మెల్లగా "...ఆఖరి రోజుల్లో వున్నాం .వాడి మీద కోపం చూపించకండి..." అంటూ ఏదో చెప్పబోయేలోగా ". నీ ఒక్కతెకే వాడి మీద ప్రేమ ఒలికి పోతున్నట్లు మాట్లాడకు.." అంటూ మరి ఆ సంభాషణ పొడిగించటం ఇష్టం లేనట్లు కవాచీ బల్ల మీద నుండి లేచి, కండువా భుజం మీద వేసుకుని వీధిలోకి వెళ్ళిపోయేరు! భర్త ఆమాత్రం మాట అన్నందుకే ఆమె మనసు ఆనందంతో ఉప్పొంగి పోయింది!

ప్రకాశం, వాళ్ళూ రావటాన్కి ఇంకా పదహారు గంటలు మాత్రమే వ్యవధి వుంది! మధ్యాహ్నం ఒక్కపూటా భోజనం చేసి వెళ్ళిపోతారు వాళ్ళు! వాడి కిష్టమయినవన్నీ రేపే చేసి పెట్టాలి!

తన చేతులతో వండి, వాడికి తినిపించి ఎంత కాలమయిందో!? ప్రకాశానికి ఇష్టమయిన పదార్థాలన్నీ జ్ఞప్తికి తెచ్చుకుని, చకచకా కార్యరంగంలోకి దిగింది ఆవిద! ఆ వడల కోసం చాయమినపప్పు నానబెట్టింది! బొబ్బట్లు చెయ్యటాన్కి శెనగపప్పు నానబోసింది! పచ్చిమిర్చి, అల్లం తరిగేసి, కరివేపాకు తురిమి పులిహోర కలపటానికి రంగం అంతా సిద్ధం చేసింది. కందిపప్పు వేయించి కందిగుండ విసిరి, ఉప్పుకారం సమతూకంలో కలిపింది! ఎర్రగోంగూర మిరప్పళ్ళతో కలిపి పచ్చడి చేసింది! వెళ్ళేటపుడు సీసాల్లో సర్ది ఇవ్వటానికి వీలుగా మరింత తయారు చేసింది! నెలరోజులు నిలవ వుండటానికి ఇంగువ కాచిన నూనె ఓ అర్ధ పావు పోసి, పచ్చడి సీసాల్లోకి సర్దింది!!!

రేపు, కూర ఏం వండాలి?!

కాకరకాయల్లో గింజలు తీసేసి, ఉల్లి కారం కూరి వండితే - ఎంతో ఇష్టంగా తింటాడు ప్రకాశం! మెంతికారం పెట్టి గుత్తి వంకాయ కూర వండితే, మరి ఇష్టం వాడికి!!

శెనగపప్పుకు కొబ్బరి కోరు చేర్చి, పోపు తగిలిస్తే వదలకుండా తింటాడు! బెండకాయ వేపుడంటే ప్రాణం వాడికి!!

ఆనపకాయ తెలకపిండి పెట్టి వండితే సరేసరి!!!

వీటిలో ఏవేవి వండటం???

అంతలోనే ఆమెకు చటుక్కున గుర్తుకు వచ్చింది - అరటిదూట కూర, ఆవపెట్టి వండితే ప్రకాశానికి మహా ఇష్టమని!! పట్నంలో చదువుకునే రోజుల్లో - ఇంటికి వచ్చినప్పుడల్లా అరటి దూట కూర వండమని వేధించుకు తినేవాడు ప్రకాశం!

బొంబాయిలాంటి మహానగరంలో అరటి దూట ఎక్కడ దొరుకుతుంది? ఎన్నాళ్ళయిందో వాడు ఆ కూర తిని!

ఆ ఆలోచన రావటమే తరువాయి పనిమనిషి చేత పెరట్లో అరటిచెట్టు కొట్టించి బోదెలు వలిపించేసింది. నవనవలాడుతున్న దూటను బయటకు తీయించింది.

విశ్వనాథంగారు చీకటి పడ్డాక ఇంటికి వచ్చి మండువాలో కామాక్షమ్మగారు పడుతున్న హైరానా చూసి విస్తుపోయారు! ఒక వారగా తిరగలి చుట్టూ గోనె పట్టామీద ఒలికిపోయిన కందిగుండ, మరో మూల తుంపి పారేసిన ఎర్ర గోంగూర కాడలు, వలిచి పారేసిన అరటి దొప్పలు; గిన్నెలలో నానబెట్టిన రకరకాల పప్పులు; మరొక వంక పళ్ళెంలో సిద్ధం చేసిన మిర్చి, అల్లం ముక్కలు, ఇదంతా చూసి విశ్వనాథం గార్కి మతిపోయినట్లయ్యింది!

"ఏమిటీ హడావుడి?" అంటూ భార్య వంక చూసేరు

పనిలో నిమగ్నమయిపోయిన కామాక్షమ్మ గార్కి భర్త మాటలు విన్పించలేదు

అరటిదూట చకచకా చక్రాల్లా తరుగుతూ, బయటకు వస్తున్న దారాలాంటి పీచును చూపుడు వేలికి చాకచక్యంగా చుట్టుకుంటూ, మోచేత్తో నుదుట పట్టిన చెమట ఒత్తుకొంటూ, ఒగరుస్తూ, కత్తిపీట ముందు కూర్చున్న కామాక్షమ్మగార్ని చూస్తే జాలి కలిగింది విశ్వనాథం గార్కి!

"కాముడూ! ఏమిటిదంతా?" అన్నారు

కామాక్షమ్మగారు మెల్లగా తలెత్తి చూసేరు!

చెమటకు ముక్కు మీదుగా జారిపోతున్న కుంకుమను చిటికెన వేలికి చీర చెంగు తగిలించి సుతారంగా తుడుచుకున్నారు! తుడవగా మిగిలిన కొద్దిపాటి కుంకుమ పొడి, చెమటతో కలిసి ముక్కుకు బిగించిన తెల్లని ఒంటి రాయి పొడి నత్తుమీద నిలబడి కెంపులా మెరుస్తోంది!

ఆవిడ కన్నులనిండా వెలుగు!!

అంతవరకూ పనివలన కలిగిన అలసటను - భర్త 'కాముడూ' అని పిలవటంతో - మరిచిపోయారు! తనపై ఎంతో జాలి కల్గిన క్షణంలో తప్ప తనను అలా సంబోధించడని ఆవిడకు తెలుసు!!

"కాముడూ! నీకు మతిపోలేదు కద! ఏమిటీ హైరానా అంతా?" మళ్ళీ అడిగారాయన

"రాక రాక ఎన్నేళ్ళ తర్వాతో వస్తున్నాడు వాడికి ఇష్టమైనవి నాలుగూ చేసి పెడదామని!"

"బాగుంది నీవరుస! వాడు వుండేది ఒక్క పూట! ఆ ఒక్క పూటలోనూ వాడి చేత అయిదు సంవత్సరాల తిండీ తినిపించేద్దామనుకుంటున్నావేమిటి? . '

మాటలు క్షణంసేపు ఆపి చేతిలోని చుట్ట నుసి దులుపుతూ " అయినా, నీ వెర్రిగానీ, ఈ పల్లెటూరి తిళ్ళు వాడు తింటాడా? ఇవన్నీ ఏనాడో మరిచిపోయి వుంటాడు!" అన్నారు

ఈ మాటలతో కామాక్షమ్మగారు డీలాపడిపోయారు కొంతసేపు! అంతలోనే మళ్ళీ ధైర్యం పుంజుకొని "పట్నవాసంలో వున్నంత మాత్రాన




## వంటలు.......

### బాంబినో పాయసం

1 కప్పు బాంబినో వెర్మిసెల్లిని
1/4 కప్పు నెయ్యి
5 కప్పుల కాచిన పాలు
3 చుక్కల ఏలక్కాయల రసం
1/4 కప్పు డ్రై ఫ్రూట్ ముక్కలు
రుచికి చక్కెర

బంగారు గోధుమ చాయ వచ్చే బాంబినోను నేతిలో వేయించాలి. కాచిన పాలు పోసి సన్నసెగ మీద పాలూ బాంబినో బాగా మెత్తబడే వరకు ఉంచాలి. చక్కెర, ఏలక్కాయలు రసం 3 చుక్కలు వేసి బాగా కలిపాలి. డ్రైఫ్రూట్ ముక్కలు మీద పరచాలి



వాడికి ఇష్టమయిన రుచులు మారిపోతాయేమిటి? మీరు మరి చెబుతారు" అంది నిరసనంగా

విశ్వనాథంగారు చిన్నగా నవ్వుతూ అన్నారు" మన ప్రాణాలన్నీ వాడి మీదే పెట్టుకుని పెంచి పెద్దవాణ్ణి చేశాము? చివరకు ఏం చేశాడు? బెల్లం ముక్కలాంటి బెంగాలీ అమ్మాయి కనుపించగానే మనల్ని మరిచిపోయేడు హు! ఈపాటికి వాడు ఏ ఎండు చేపలో తిని అఘోరిస్తూ వుంటాడు! నీ అరటి దూట కూర ఎవడిక్కావాలి?"

మాటలు ముగించి గబగబా పెరట్లోకి వెళ్ళిపోయారు

కామాక్షమ్మగారి మనసు కొంతసేపు విలవిల్లాడింది అంతలో నే-

'ప్రకాశం అలా మారిపోడు!' అని మనసుకు సర్ది చెప్పింది!

ఇల్లంతా ఊడ్చి ముగ్గులు పెట్టి నడుం వాల్చేసరికి రాత్రి పన్నెండు దాటి పోయింది!

* * * * *

ఉదయం నాలుగ్గంటలకు పక్కమీద నుండి లేచిందే తడవు వంటింట్లో కర్రల పొయ్యి రాజేసింది కామాక్షమ్మగారు!

పట్నానికి ఎనిమిదిన్నరకు రైలు వస్తుంది! అంటే - తొమ్మిదో గంటకల్లా వాళ్ళు ఇక్కడకు చేరుకుంటారు. అప్పటికి వంట తెముల్తుందో, తెమలదో అని ఆవిడ భయం!

వంటయిపోతే, ఆ నాలుగ్గంటల సేపూ వాడితో కబుర్లు చెప్పొచ్చు! కోడలు భాష నేర్చుకుందో, లేదో!

ఇందూకి తెలుగు వచ్చునో, రాదో!!

అయిదు గంటల సమయంలో - కంచు గ్లాసుడు కాఫీ గటా గటా త్రాగేసి - పై మీది ఉత్తరీయం సవరించుకుని, చుట్ట ముట్టిస్తూ బయటకు వెళ్తున్న భర్త వంక చూస్తూ "తొందరగా వచ్చెయ్యండి, అబ్బాయీ వాళ్ళూ తొమ్మిది గంటలకు

## "అమృతహస్తం"

వచ్చేస్తారు కదా!" అంది ఆవిడ

"ఒసి నీ ఇల్లు బంగారంగానూ, నేను వెళ్ళేది బహిర్దేశానికి! బెంగుళూరు కాదు!' అన్నారు నవ్వుతూ

"వచ్చేటప్పుడు ఎవరితోనో మాటల్లో పడి ఇల్లు మరిచిపోతారు! అందుకని చెప్తున్నాను .. అయ్యో .. నా మతిమరపు మండ! .. మరిచేపోయాను చూశారా? ., ఎనిమిది గంటలకు బట్టల కొట్టు తెరుస్తారు . కోడలికి మంచి చీర, రవికెల గుడ్డ తీసుకురావాలి ఆ చేత్తోనే మనవరాలికి ఓ గౌను గుడ్డ మరిచిపోవద్దు . " అంటూ పొగనిండి పోతున్న పొయ్యి ఊదటానికి వంటింట్లోకి పరుగు పెడుతున్నట్లే వెళ్ళిందామె!

భార్య వెళ్ళిన వంకే రెండు క్షణాలు వింతగా చూస్తూ వుండిపోయారు విశ్వనాథంగారు!

తర్వాత వీధి వైపుకు కదిలిపోయారు!!!

* * * * *

రావల్సిన సమయం రానే వచ్చింది! టాక్సీలో ప్రకాశం, కోడలు, మనవరాలు దిగేరు! గుమ్మం దగ్గర వాళ్ళను ఆపి దిష్టి తీసి లోనికి తీసుకువచ్చింది కామాక్షమ్మగారు

ప్రకాశం బాగా చిక్కిపోయినట్లు కన్పించేడు ఆమె కంటికి!

కోడలు "నమస్తే కామాక్షి అత్తయ్యగారూ" అంటూ ఆరంభించి మాటలు తడుముకుంటూ తెలుగులో నే మాట్లాడింది

బుట్టబొమ్మలా వున్న ఇందూని చూస్తూ వెర్రిదానిలా వుండిపోయింది కామాక్షమ్మగారు కొంతసేపు

"నాన్నా! మీ ఆరోగ్యం బాగుందా?" అన్నాడు ప్రకాశం.

'ఆ! ఆ! ఏదో! బాగానే వుంది ' అన్నారు పొడిగా విశ్వనాథంగారు

మనసు రాజీ పడినా మాటలు బయటకు రావటానికి కొన్ని సెకనులు అవసరమయ్యేయి

ఆ టాక్సీ ఎందుకు? పంపించెయ్!" అన్నారు మళ్ళీ

'వుండేది నాలుగ్గంటలే కదా! వెయిటింగ్ చార్జెస్ ఇచ్చేస్తాను! ఫర్వాలేదు! అన్నాడు ప్రకాశం

కామాక్షమ్మగారు మూడు గ్లాసులతో కాఫీ తెచ్చారు!

"కాఫీ ఆయన వంటికి పడదు! నేనూ -ఇందూ అసలే తీసుకోం!" అంది కోడలు. కామాక్షమ్మగారు విస్తుపోయారు!! 'అర గంటకోసారి కాఫీ త్రాగే ప్రకాశానికి కాఫీ పడకపోవటమేమిటి?' అనుకున్నారు

"ఆయన కాంప్లాన్ తాగుతారు నేనూ, ఇందూ బోర్నవిటా త్రాగుతాం పాలు వుంటే పంచదార వేసి ఇవ్వండి, చాలు!" అంటూ బేగ్‌లోంచి కాంప్లాన్, బోర్నవిటా డబ్బాలు తీసి పైన పెట్టింది కోడలు

కామాక్షమ్మగారు తెచ్చిన పాలుతో కాంప్లాన్ కలిపి భర్తకు ఇచ్చింది

తర్వాత తనూ, ఇందూ బోర్నవిటా కలుపుకుని త్రాగేరు

ఆ దృశ్యం చూసి రెండు క్షణాలు కామాక్షమ్మగారి మనసు బాధతో మూల్గింది! – అయితే స్నానాలు పూర్తయ్యాక వంటింట్లో భోజనం ముందు కూర్చున్నాక, కోడలు పిల్ల చేసిన హడావుడి మాత్రం, కామాక్షమ్మగార్ని మతిని పోగొట్టింది!

కంచంలోనూ, ప్లేట్లలోనూ సర్ది పెట్టిన వంటకాలన్నీ చూసి "కామాక్షి అత్తయ్యగారూ!ఇవన్నీ ఏమిటి?' అంది అదోలా ముఖం చిట్లించుకొంటూ!"

ప్రకాశం ఆమెకు పేరు పేరునా వంటకాలను గురించి వివరాలు అందించేడు

"మైగాడ్! ఇవన్నీ మీరు తింటారా? నో నో . అత్తయ్యగారూ! ఇవి ఆయన వంటికి పడవు!" అంటూ బాంబు పేల్చింది. క్షణం ఆగి

'బ్రింజాయిల్ ఆయనకి ఎలర్జీ . టేమరిన్ రైస్ అసలే పడదు . బొబ్బట్లు! మిన్స్ . టెరిఫిక్ స్వీట్ అసలే షుగర్ కంప్లెయింట్ వచ్చే ఏజ్ ఓహ్! రెడ్ ఛిల్లీస్ ఇన్ చెట్నీ డైరెక్ట్ ఛిల్లీస్ . ఎలా తింటారు? . అల్సర్ ఫారమ్ అయిపోతుంది .. వద్దు .. మిన్స్ వెరి ఇన్ డైజెస్టివ్ సబ్‌స్టెన్స్' ." అంటూ పేరు పేరునా ప్లేట్లలోని వస్తువుల వంక చూపుడు వేలితో చూపుతూ వాటిని దూరంగా తోసేసింది!!!

ఆఖరున దూటకూర వంక చూపిస్తూ "ఇది ఏమిటి?" అంది.

"అది అరటి దూట . ఐ మీన్' ..." అంటూ దానికి సరియైన ఇంగ్లీషు బెంగాలీ పదాలు తెలియక కొంతసేపు బుర్ర గోక్కుని తర్వాత అరటి చెట్టుని చేత్తోనే విలిచినట్టు నటించి దూట ఎలా తీస్తారో,

దూట అంటే ఏమిటో, ఆమెకు అర్థమయ్యేలా చెప్పేడు ప్రకాశం!

ఆ వివరాలు వినగానే అతి అసహ్యంగా ముఖంపెట్టి, దాదాపు కెవ్వున కేక వేసినంత పని చేసింది కోడలుపిల్ల!!!

"బఫెలో ఫీడ్ అది! మీరు తింటారా?" అంటూ భర్త వంక నిరసనగా చూసి, ఆ ప్లేటు దూరంగా జరిపేసింది ఆమె.

ప్రకాశం ఒక్క నిమిషం దెబ్బతిన్నట్లు ఆమె వంక చూసి, మౌనంగా వుండిపోయాడు. కోడలు పిల్ల మాటలకు అర్థాలు పూర్తిగా బోధ పడకపోయినా, వాటిలో తినటానికి వచ్చేవి ఏమీ లేవని నిర్ధారించిందని మాత్రం కామాక్షమ్మగార్కి అర్థమయిపోయింది!! జరిగే తతంగం అంతా తనకేమి పట్టనట్లు పుగాకు ఈనెలు తీస్తూ కవాచీ బల్లమీద కూర్చుని చూస్తున్నారు విశ్వనాథంగారు!

కోడలుపిల్ల కంచందగ్గరనుండి లేచి చకచకా వెళ్ళి తన ఎయిర్‌బేగ్‌లోనుండి నాలు గు ఏపిల్సు,

# అమృతహస్తం

ఒక పొడవాటి బ్రెడ్, జామ్ సీసా బయటకు తీసింది!

"బొత్తిగా కేలరీస్ లేని తిండి తింటే ఎలాగ? అసలే మీ ఆరోగ్యం అంతంత మాత్రం! డాక్టర్ సతీష్ ఘోష్ మొన్న ఏమి చెప్పారో గుర్తు లేధా మీకు?!" అంటూ గబగబా ఆపిల్సు తరిగి పళ్ళెంలో సర్దింది. తర్వాత బ్రెడ్ స్లయిసెస్‌కు జామ్ అతి తక్కువగా రాసి రెండేసి కలిపి కంచాల్లో పేర్చి పెట్టింది!

"అవి తినేసి, కొంచెం కర్డ్ రైస్ తినండి!" అంటూ, "కామాక్షి అత్తయ్యగారూ! ఇవన్నీ వండినందుకు థేంక్స్! ఇవేవీ ఆయనకు సరిపడవు!.... కాస్త "కర్డ్" ఇవ్వండి!" అని మాట్లాడటం ముగించి ఇందూకి ఆపిల్ ముక్కలు అందించింది

కామాక్షమ్మ గార్కి కాళ్ళ కింద భూమి చీలిపోతున్నట్లు అన్పించింది.

"నిన్న సాయంకాలం నుండీ తాను పడిన కష్టమంతా వృధాయేనా?" అనుకుంటూ కొంతసేపు కొర్రులా నిలబడి పోయింది!

"పెరుగు తెచ్చి వడ్డించు!" విశ్వనాథం గారి మాటలతో ఈ లోకంలోకి వచ్చి వంటింట్లోకి కదిలింది! పెరుగు గిన్నె తెచ్చి వాళ్ళ దగ్గర పెట్టింది!! కోడలు పిల్ల పెరుగు గిన్నె దగ్గిరకు తీసుకుని, ముట్టుకుంటే కందిపోతుం దన్నట్లు, పై మీగడను జాగ్రత్తగా తొలగించి, లోపలి పెరుగు మాత్రం రెండే రెండు చెమ్చాలు ప్రకాశం కంచంలోనూ, మరొక చెంచా ఇందూ కంచంలోనూ విదిల్చింది!!!

మూలుగుతున్న మనసును మరి సంబాళించుకో లేకపోయింది కామాక్షమ్మ గారు! "ఆ పైమీగడ తీసి ప్రకాశానికి వడ్డించమ్మా! మీగడ ప్రకాశానికి ఎంతో ఇష్టం! నువ్వు కూడా తిను.... ఎంతో రుచిగా వుంటుంది! ఎదిగే పిల్లలకు మరి మంచిది!.... ఇందూకి పెట్టు! ..." కాస్త కటువుగానే అంది ఆమె ఈ మాటలు!

కోడలు పిల్ల చిరునవ్వు నవ్వేసింది!!

"కామాక్షి అత్తయ్య గారూ! థేంక్యూ!! మీగడ నిండా "ఫేట్" వుంది! అది తింటే "కెలోస్ట్రల్ వేల్యూ" పెరిగి పోతుంది!" అంది సుతారంగా!

చక్కగా పిడకలతో "దాలి" పెట్టి కాచిన కమ్మని గేదెపాలు తోడుపెడితే, దానిమీద ఎర్రగా ఇంత మందాన గూడు కట్టే మీగడలో, అద్భుతమయిన్న రుచి వుందని మాత్రమే కామాక్షమ్మ గార్కి తెలుసు కానీ, "ఫేట్" వుందని తెలీదు!!

కమ్మని పెరుగూ అన్నం తృప్తిగా తింటే పెరిగేది ఆరోగ్యమే కానీ, మరేదో పెరిగి పోతుందంటోంది కోడలు పిల్ల!! అదేమిటో అసలు అంతు చిక్కలేదు కామాక్షమ్మగార్కి!

భోజనాలు పూర్తయిపోయాక –

"అమ్మా! నువ్వూ, నాన్నా బొంబాయి వచ్చెయ్యండి!" అన్నాడు ప్రకాశం!

"యూ ఆర్ వెల్‌కం అత్తయ్యగారూ!" అంది కోడలు పిల్ల!

"ప్లీజ్! డూ కమ్ గ్రేండ్‌మా!" అంది ఇందూ!

"ఈ వూరికి అలవాటు పడిన వాళ్ళం! వదిలేసి రావటం అంత సులువా?" అంటూ తేలిగ్గా నవ్వేశారు విశ్వనాథం గారు.

సామాన్లు సర్ది టేక్సీలో చేర్చేడు ప్రకాశం!

బయలుదేర బోయేముందు కామాక్షమ్మగారి పాదాలకు వంగి నమస్కరించేరు ఇద్దరూ! కొత్త బట్టలు పెట్టి కన్నీళ్ళతో సాగనంపేరు వాళ్ళని కామాక్షమ్మ గారు!

టాక్సీ కదిలి పోయింది!!!

దిగులుగా లోనికి వచ్చిన కామాక్షమ్మ గార్కి, వంటింట్లో గిన్నెల నిండా మిగిలి పోయిన పదార్థాలు చూస్తే కళ్ళ నీళ్ళపర్యంత మయింది!

"కావుడూ!...." భర్త పిలుపు విని చీర చెంగుతో కళ్ళు ఒత్తుకుంది!

".... వయసొచ్చేవరకూ వాడి అవసరాలు,

ఆంధ్ర సచిత్ర వారపత్రిక పాఠకులకు మంచి అవకాశం!
పోస్టల్ చందా దారులకు
మీ డబ్బు రు.20/- ఆదా చేసుకోండి!

ఆంధ్రసచిత్ర వారపత్రికకు ఒకేసారి సంవత్సర చందా కట్టే వారు బాలరంజని బాలల మాసపత్రికను 10 నెలలు ఉచితంగా పొందుతారు ఇది రు. 20/–ల ముదరాతో సమానం.

సంవత్సర చందా రు 143/–లు చెల్లించిన వారికి 52 వారాలు ఆంధ్రసచిత్ర వారపత్రికతో పాటు బాలరంజని 10 మాసములు ఉచితంగా పంపబడును పోస్టు ఖర్చులు మావే

చందా కట్టే వారు మనియార్డరు/. డిమాండు డ్రాఫ్టు ద్వారా సర్క్యులేషను మేనేజరు, ఆంధ్రపత్రిక, విజయవాడ–3 అను చిరునామాకు పంపుతూ ఈ దిగువ కూపను జతపరచాలని మనవి

నేరుగా మా కార్యాలయానికి చందా కట్టే వారికే ఈ సదుపాయం

ఆంధ్రసచిత్ర వారపత్రిక సంవత్సర చందా రు. 143/–లు మనియార్డరు/ డిమాండు డ్రాఫ్టు ద్వారా చెల్లిస్తున్నాను నాకు ముదరాగా 10 నెలలు బాలరంజని సరఫరా చేయగోరా్తను.

పేరు : ______

అడ్రసు . ______

______

రుచులు నువ్వు చూసుకున్నావ్! ఇపుడు వాడి పెళ్ళాం చూసుకుంటోంది! ఇందులో దిగులు పడటానికి ఏమి లేదు" అన్నారు విశ్వనాథం గారు, భార్యను అనునయించే ధోరణిలో.

"లేదండీ! వాడెప్పుడూ నాకు అద్దాల్లో బిడ్డడే! తిండి సరిగ్గా కుదరక చిక్కి సగమయ్యాడు చూడండి! .." అంది గొణుగుతున్నట్టు!

"సర్లే. అనవసరంగా దిగులుపడకు!.. . నేను పెద్దిరాజు గారింటికి వెళ్ళొస్తాను!.... నువ్వు భోజనం కానియ్! .." అంటూ కండువా పైమీద వడేసుకుని, బయటకు నడిచేరు విశ్వనాథంగారు!

వంటింటి గుమ్మం గడప దగ్గర అలాగే కూలబడి పోయారు కామాక్షమ్మ గారు, వండిన వంటకాల వంక చూస్తూ!!

అలా ఎంత సమయం గడిచి పోయిందో, ఆవిడకే తెలీదు!!!

వీధిలో కారు హారను "ఖయ్యి"మని మ్రోగటంతో ఆలోచనల నుండి తెప్పరిల్లి అటు చూసేరు!

హడావుడిగా లోనికి వచ్చేడు ప్రకాశం!

కాలి బూట్లు విప్పి ఒక వారగాపడేస్తూ, "అమ్మా! అన్నం వడ్డించు నాక్కు! నా అదృష్టం కొద్దీ రైలు రెండు గంటలు లేటు! పర్సు మరిచి పోయానని చెప్పి చక్కా వచ్చేను! అరటిదూట కూర వేసి నువ్వే కలుపు! ఎన్నాళ్ళయిందో నీ వంట తిని!!.... బొంబాయిలో చప్పిడి వంటతో జిహ్వ చచ్చి పోయిందనుకో! .. బొబ్బట్లలో నెయ్యి వెయ్యటం మరిచి పోకు! . ఇందాకటి మిగడపెరుగు కూడా కంచం దగ్గర పెట్టు. కాళ్ళూ చేతులూ కడుక్కుని వచ్చేస్తాను!..." అంటూ హడావుడిగా తువ్వాలు తీసుకుని పెరట్లోకి పరుగెత్తిన ప్రకాశం వంక మతి పోయినట్టు చూస్తూ వుండిపోయారు కామాక్షమ్మ గారు!

అది "కలయో, వైష్ణవ మాయయో" అనిపించింది కొంతసేపు!

తర్వాత - కామాక్షమ్మ గారి మదిలో ఆనందతరంగాలు ఉవ్వెత్తున లేచిపడ్డాయి!సంభ్రమంతో ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగేయి!

గబగబా లేచి వెళ్ళి పీట వాల్చి, కంచం పెట్టి, అన్నం వడ్డించేరు!

మూడు నిమిషాలు తర్వాత -

వీధిలో ఆగి వున్న కారు వంక సంభ్రమంగా చూస్తూ, ఇంట్లో అడుగు పెట్టిన విశ్వనాథం గారు, వంటింట్లోని దృశ్యం చూసి కొంతసేపు అలాగే నిలబడి పోయారు!

కూర అన్నం కలిపి ముద్దలు చేసి ప్రకాశం నోటికి అందిస్తోంది కామాక్షమ్మ గారు!!

ఊహ తెలిసేక, సుమారు యాభయి అయిదేళ్ళ జీవితంలో, ఆయన కంట నీరు తిరిగిన గుర్తు లేదాయనకు!!!

కానీ- ఆ క్షణంలో, ఇందుపగింజలంత కన్నీటి బొట్లు కనుకొలకుల్లో నిలిచి, ఆయన కనులు మసక బారేయి!!! □


**B.A./M.A. Direct Final**

**(ONE SITTING)**

**1. B. A. ONE SITTING**
ఇంటర్మీడియట్/పి.యు.సి. పాసైనవారు అర్హులు.
ఇంగ్లీషు/తెలుగు మీడియం.

**2 M.A. ONE/TWO SITTINGS**
బి.ఏ./బి.కాం./బి యస్సి/ఇంజనీరింగ్/మెడికల్ గ్రాడ్యుయేట్స్ అర్హులు.

**3. B.A./B.Com ENTRANCE EXAM**
ఏ విద్యార్హత లేకున్నను 20 సం॥లు నిండినవారు అర్హులు.
తెలుగు/ఇంగ్లీషు మీడియం.

* పరీక్షలు రికగ్నైజ్డ్ యూనివర్శిటీచే నిర్వహింపబడును.
* రికగ్నైజ్డ్ డిగ్రీ పొందవచ్చును.

పూర్తి వివరములుగల ప్రాస్పెక్టసుకై రు. 6/- లు M.O. ద్వారా పంపుచు పూర్తి వివరములు పొందండి.

**Vijaya Institute of Correspondence Courses,**
Lalitha Colony, VISAKHAPATNAM - 530020.



# భారతి

సాహిత్య మాసపత్రిక

తెనుగువారి
సంస్కృతికి
ప్రతిబింబం

విడి ప్రతిక: రూ. 4/-